GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 16-11-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

అభివృద్ధి.. సంక్షేమం జోడెడ్లుగా కాంగ్రెస్ పాలన

ం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు.. ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ం గత పాలకులు పింఛన్లు, రేషన్ కార్డులను, పేదోడి గూటిని పట్టించుకోలేదు

ం కాళేశ్వరం పేరుతో.. కమీషన్ల పాలన చేసింది రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ం తిరుమలాయపాలెం మండలంలో కొత్తగా 1,123 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:

అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి కొత్తగా మంజూరైన 1,123 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను కలెక్టర్ దివాకర్ టీఎస్, కాంగ్రెస్ నేతలతో కలిసి మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించారని, పింఛన్లు, రేషన్ కార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.

మిగతా 2లో

ఎలికేశ్వరం–1 ఇసుక రీచ్‌లో అక్రమ వసూళ్లే దందా..!!

ం ఒక్కో లారీపై రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు వసూళ్ల ఆరోపణలు

ం వీఓ అండదండలున్నాయా? క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఏది?

ం క్వాలీ యాజమాన్యం ఇష్టారాజ్యమా, ప్రభుత్వ నిబంధనలు బేఖాతరా

ం అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటి?

ం ప్రజాస్వామ్యం ఉన్నట్లా.. లేనట్లా?

7



జోగిపేట ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి

త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలి

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

మంత్రి దామోదర్ రాజనర్సింహ

8



గుంతల రోడ్డుపై గమ్యం చేరేదెలా?

ం గుంతలమయంగా కిష్టారెడ్డిపేట–కోడకంచి రహదారి

ం భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమైన రోడ్డు

ం ప్రమాదాల అంచున ప్రయాణికులు!

ం జిన్నారం, బొంతపల్లి, పారిశ్రామిక ప్రాంత కార్మికులకు తప్పని తిప్పలు

ం అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి | నవంబర్ 15:

పారిశ్రామిక అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్న జిన్నారం, బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. కిష్టారెడ్డిపేట నుండి కోడకంచి వరకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే కార్మికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కంకర క్రషర్ల గుండి వందలాది భారీ టిప్పర్లు నిరంతరం రాకపోకలు సాగిస్తూఅధిక లోడుతో ప్రయాణించడం వల్ల రహదారి పూర్తిగా ధ్వంసమయ్యిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో కంకర క్రషర్లకు సెనిండ్విలిని భారీ టిప్పర్లు రోజూ పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి.

8

అభివృద్ధి.. సంక్షేమం జోడెడ్లుగా కాంగ్రెస్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై క్వింటాకు రూ.500 బోనస్, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు మంజూరు చేస్తూ అండగా నిలుస్తున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.40 వేల కోట్లు

మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, హైదరాబాద్‌లో పేదలకు మరో లక్ష ఇళ్లు కేటాయించామని మంత్రి వెల్లడించారు. ఈ నెలాఖరులోగా తుది బిల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మొత్తం రూ.40 వేల కోట్లతో ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామని, మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

పాలేరు నియోజకవర్గంలో అదనంగా 5,279 పింఛన్లు

తిరుమలాయపాలెం మండలంలో ఇప్పటికే 9,024 మందికి నెలకు రూ.2.99 కోట్ల పింఛన్లు అందుతున్నాయని, తాజాగా మరో 1,123 మందికి రూ.38.76 లక్షల విలువైన పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 37,039 మందికి రూ.8.69 కోట్ల పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 5,279 మందికి రూ.1.43 కోట్ల పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీలో 968, కూసుమంచి మండలంలో 1,126, ఖమ్మం రూరల్ మండలంలో 882, నేలకొండపల్లి మండలంలో 1,175, తిరుమలాయపాలెం మండలంలో 1,123 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రూ.26 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, రూ.46 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మించడంతోపాటు డొంకలు, మట్టి రహదారులను తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య, విద్యా సదుపాయాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, ఆత్మ కమిటీ పాలేరు నియోజకవర్గ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,

గుంతల రోడ్డుపై గమ్యం చేరేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

బరువుతో కూడిన వాహనాల రాకపోకల కారణంగా రహదారిపై తారు పొర దెబ్బతిని పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల రహదారి ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. రోడ్డు నిర్మాణ నాణ్యత, భారీ వాహనాలపై నియంత్రణ, నిర్వహణ చర్యలపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, కంకర ధూళి గాలిలోకి ఎగసిపడుతోంది. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం, కళ్లలో దుమ్ము పడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి జారిపడే ప్రమాదం కూడా పొంచి ఉంది. జిన్నారం, బొంతపల్లి ఐడీఏ పరిధిలోని పరిశ్రమల్లో పనిచేసే వందలాది మంది కార్మికులు ప్రతిరోజూ ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నారు. విధులకు వెళ్లే సమయంలో, తిరిగి ఇళ్లకు చేరుకునే సమయంలో గుంతలు, దుమ్ము ధూళి కారణంగా అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, ఇతర వాహనాలు వెళ్లేందుకు కూడా రహదారి పరిస్థితి ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉంది. పారిశ్రామిక ప్రాంతానికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారిపై ఇలాంటి దుస్థితి నెలకొనడం అభివృద్ధి పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలోని రహదారుల నిర్వహణ, మరమ్మతులకు ప్రాధాన్యత ఉండేదని స్థానికుల్లో కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో రహదారుల పరిస్థితి మరింత దిగజారిందని విమర్శిస్తున్నారు. ప్రస్తుత పాలనలోనూ అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, కిష్టారెడ్డిపేట--కొడకంచి రహదారి దుస్థితి మాత్రం స్థానికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. ప్రభుత్వాలు మారినా ప్రజల ప్రయాణ కష్టాలు మారకపోతే పాలన వల్ల సామాన్యులకు కలిగే ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఈ రహదారి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంది? భారీ వాహనాల వల్ల దెబ్బతిన్న రోడ్డును పునరుద్ధరించేందుకు ఎలాంటి ప్రణాళిక రూపొందించింది? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. రహదారిపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చడంతో పాటు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కంకర క్రషర్ టిప్పర్ల అధిక లోడుపై నియంత్రణ విధించాలని, వాహనాల రాకపోకల సమయంలో ధూళి ఎగరకుండా నీటిని చల్లే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి సామర్థ్యానికి అనుగుణంగా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి, అవసరమైతే ప్రత్యేక రహదారి నిర్మాణంపై కూడా అధికారులు ఆలోచించాలని సూచిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందే చర్యలు తీసుకోవడం మేలు అని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కిష్టారెడ్డిపేట--కొడకంచి రహదారికి మహర్దశ తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





క్రీడల్లో రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలి

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఖేలో ఇండియా, ఫిట్ ఇండియాతో క్రీడలకు ప్రోత్సాహం

పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విజయాలు సాధించాలి

పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రపంచస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో

ఎంపీ రఘునందన్ రావు

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 15: క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ భారతదేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు పిలుపునిచ్చారు. క్రీడల్లో విజయం సాధించడానికి ఎత్తు, శారీరక బలం మాత్రమే ప్రామాణికం కాదని, మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి ఫైనల్ మ్యాచ్‌లో వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రపంచస్థాయి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలని సూచించారు. గతంలో ఒలింపిక్ క్రీడల్లో భారతదేశానికి రెండు మూడు పతకాలు వచ్చినా ఎంతో గర్వంగా భావించేవారమని, ప్రస్తుతం పారాలింపిక్స్‌లో సైతం భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని అన్నారు. అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పీటీ ఉష మహిళగా దేశానికి గర్వకారణంగా నిలిచారని, ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, నిరంతర సాధనతో ప్రతిభను మెరుగుపరుచుకోవాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని ఎంపీ రఘునందన్ రావు ఆకాంక్షించారు.





లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ కుటుంబాల్లో జరగనున్న వివాహ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు.

సివిల్ ఎస్ఐ ఓం ప్రకాష్‌కు జ్వాలా ట్రస్ట్ సన్మానం

క్రైమ్ మిర్రర్,మంగపేట:



కొత్తగూడెంలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తూ ఇటీవల సివిల్ ఎస్ఐగా పదోన్నతి పొందిన ఓం ప్రకాష్‌ను మంగపేట జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం మండల కేంద్రంలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.మండలంలోని బిక్షంపేట గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబానికి చెందిన పగిడిపెల్లి వెంకటేశ్వర్లు కుమారుడు ఓం ప్రకాష్.పోలీస్ శాఖలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఆయన ఇటీవల సివిల్ ఎస్ఐగా పదోన్నతి పొందారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన కొత్తగూడెంలో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహించారు.నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి సివిల్ ఎస్ఐగా పదోన్నతి సాధించిన ఆయనను మంగపేటలో ట్రస్ట్ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. త్వరలోనే ఆయన భూపాలపల్లి ప్రాంతంలో సివిల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన మరింతగా ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సభ్యులు ఆకాంక్షించారు.

యువతకు స్ఫూర్తిగా నిలిచిన ప్రయాణం

ఈ సందర్భంగా జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి పోలీస్ శాఖలో ఉన్నత స్థాయికి ఎదగడం స్థానిక యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న ప్రతిభను గుర్తించి గౌరవించడమే తమ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు.పోలీసు వ్యవస్థలో కింది స్థాయి నుంచి కష్టపడి విధులు నిర్వహిస్తూ పదోన్నతులు సాధించడం అనేది గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో నమ్మకాన్ని ఇస్తుందని పోలీసు అధికారులుగా ప్రజలకు సేవలు అందిస్తూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ ఇటువంటి పదోన్నతులు ఎన్నో పొందాలని కోరారు.ఈ సన్మాన కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్, ప్రచార కార్యదర్శులు మహమ్మద్ కాజా, గగ్గురి మహేష్, కార్యదర్శి పుణ్ణం భాస్కర్,ట్రస్ట్ గౌరవ సభ్యులు గార్లపాటి రాంబాబు, వనమాల సతీష్, ములకల శ్రీను, చల్లా రాంకీ పాల్గొన్నారు.

కంపెనీ వ్యర్థ జలాలపై రైతుల ఆందోళన

అధికారుల ఆదేశాలతో పైపుల తొలగింపు

రైతుల బోర్లలో కలుషిత నీరు.. సమస్యపై స్పందించిన తహసీల్దార్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి : గ్రామంలోని కాఫీ కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా ఈటీపీ ద్వారా శుద్ధి చేయకుండానే పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలోకి వదులుతున్నారని, దీనివల్ల పరిసర ప్రాంతాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గత కొన్ని రోజులుగా వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన పడకంటి వెంకటేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కంపెనీ నుంచి విడుదలవుతున్న కలుషిత నీరు భూమిలోకి చేరడంతో చుట్టుపక్కల రైతుల బోర్ల నుంచి ఎర్రటి రంగులో నీరు వస్తోందని, ఆ నీటిని తాగేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై రైతుల తరపున నిరంతరం పోరాటం చేస్తూ అధికారులకు పలుమార్లు విన్నవించడంతో వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్ వెంటనే స్పందించారు. ప్రభుత్వ భూమిలోకి అనుమతి లేకుండా వ్యర్థ జలాలను వదలడం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, మూగజీవాలకు నీటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు కంపెనీ యాజమాన్యం ప్రభుత్వ భూమిలోకి వ్యర్థ జలాలను మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైపులను వెంటనే తొలగించింది. దీంతో రైతులు చేస్తున్న ఆందోళనకు కొంత ఊరట లభించింది. రైతుల ఆరోగ్యం, పంటలు, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ జలాల వల్ల పరిసర గ్రామాల ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తన పోరాటం ఎల్లప్పుడూ కొనసాగుతుందని పడకంటి వెంకటేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



జూపల్లి చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక చేయూత

విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజల నిర్వహణకు రూ.20 వేల విరాళం అందజేత

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (చారకొండ): చారకొండ మండలంలోని జూపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 19న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తనవంతు సహకారంగా రూ. 20 వేల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి ద్వారా గ్రామ నాయకుడు బొజ్జయ్యకు అందించారు. గ్రామంలో ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలయ



కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించిన గోలి శ్రీనివాస్ రెడ్డికి గ్రామ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, యువ నాయకులు అంజి మాస్టర్, పోలె అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్చాల గ్రామంలో 71 నూతన చేయూత పింఛన్ల మంజూరు..



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: మార్చాల గ్రామంలోని అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం నూతనంగా 71 చేయూత పింఛన్లు మంజూరు చేసిన సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా పింఛన్లు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. మార్చాల గ్రామంలో 71 మంది పేదలకు కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు కావడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి నెలా అందే పింఛన్ సొమ్ము పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన పేద ప్రజలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్చాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలాభిషేక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దేవుడి భూమి లెక్కల్లో గందరగోళం!

- ఇర్విన్ చెన్నకేశవ స్వామి భూమిపై వీడని సందిగ్ధత
- 17 ఎకరాల భూమి.. కొత్త సర్వేలో 9 ఎకరాలకే పరిమితం!
- మిగిలిన 8 ఎకరాల 22 గుంటల భూమి ఏమైంది?
- హద్దులు నిర్ణయించేదెప్పుడు..? లెక్కలు తేల్చేదెవరు..?
- దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారుల తీరుపై గ్రామస్తుల ప్రశ్నలు



క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): దేవుడి భూమికే దిక్కులేకపోతే సామాన్యుల భూములకు రక్షణ ఎక్కడ. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ రెవెన్యూ శివారులోని చెన్నకేశవ స్వామి భూమి వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పాత సర్వే నంబర్‌లో నమోదైన భూమి విస్తీర్ణానికి, కొత్త సర్వే నంబర్‌లో నమోదైన విస్తీర్ణానికి భారీ వ్యత్యాసం కనిపిస్తుండటంతో భూమి లెక్కలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. పాత సర్వే నంబర్ 11లో చెన్నకేశవ స్వామికి సంబంధించి 17 ఎకరాల 34 గుంటల భూమి రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నట్లు పేర్కొంటున్నారు. సర్వే నంబర్ల మార్పులో భాగంగా ఈ భూమిని కొత్త సర్వే నంబర్ 19గా మార్చినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే కొత్త సర్వే నంబర్ 19లో కేవలం 9 ఎకరాల 12 గుంటల భూమి మాత్రమే నమోదైనట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. దీంతో అసలు 17 ఎకరాల 34 గుంటలు ఉన్న భూమిలో మిగిలిన 8 ఎకరాల 22 గుంటలు ఎక్కడికి వెళ్లాయి? ఆ భూమి ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉంది? రెవెన్యూ రికార్డుల్లో విస్తీర్ణం తగ్గడానికి కారణాలేమిటి? అనే ప్రశ్నలు గ్రామస్తుల్లో తలెత్తుతున్నాయి.

దేవుడి భూమిపై అధికారుల నిర్లక్ష్యమెందుకు?

చెన్నకేశవ స్వామికి సంబంధించిన భూమి విస్తీర్ణంలో ఇంతటి వ్యత్యాసం కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాత రికార్డులు, కొత్త రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూమి అసలు విస్తీర్ణం ఎంత అనే విషయాన్ని అధికారికంగా వెల్లడించాల్సిన బాధ్యత దేవాదాయ, రెవెన్యూ శాఖలపై ఉందని పేర్కొంటున్నారు.

క్షేత్రస్థాయి సర్వేతోనే అసలు విషయం వెలుగులోకి!

సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పాత, కొత్త సర్వే నంబర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించి భూమి విస్తీర్ణాన్ని నిర్ధారించడంతో పాటు, శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. భూమి లెక్కల్లో వ్యత్యాసం ఎందుకు వచ్చిందో, మిగిలిన భూమి వివరాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేవుడి భూమి విషయంలోనే ఇంతటి సందిగ్ధత నెలకొంటే.. ఆ భూమికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? మిగిలిన భూమి లెక్కలు ఎప్పుడు తేలుస్తారు? సంబంధిత అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? అన్నది వేచి చూడాలి.



కల్వకుర్తిలో శుభకార్యాలకు హాజరైన జూపల్లి భాస్కర్ రావు

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన పలు శుభకార్యాలకు జూపల్లి భాస్కర్ రావు హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బొడ్డు సాల్వా చారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అక్కి అల్లాజీ కుమార్తె, కుమారుడికి నిర్వహించిన పుట్టు పంచెల కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జూపల్లి గ్రామ సర్పంచ్ అనూష జగపతి, సీఐ భాస్కర్, కరెంటు మల్లయ్య, సిద్దయ్య, పుల్లయ్య, భాస్కరరావు యువసేన అధ్యక్షుడు ఎండీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బీఎం సందీప్ నియామకం..

అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కసిరెడ్డి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సెక్రటరీ బి.ఎం. సందీప్‌ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బీఎం సందీప్‌కు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గతంలో మహారాష్ట్ర, గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల్లో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన అనుభవం బీఎం సందీప్‌కు ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే ఆయన నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా గత ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి చేసిన కృషిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణంలో ఆమె అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కొత్త ఇన్‌ఛార్జ్ కీలక పాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా పాలన, రైతు భరోసా, మహిళా శక్తి, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన ఇన్‌ఛార్జ్ సహకారంతో మరింత కృషి చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలేది?

ఖాళీ కుర్చీతో బీఆర్ఎస్వీ నిరసన



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్వీ కల్వకుర్తి నియోజకవర్గ నాయకుడు మీసాల వర్షిత్ (చిక్కి) ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అశోక్‌నగర్‌లో నిరుద్యోగులతో కలిసి చాయ్ తాగిన రాహుల్ గాంధీ, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీ జరగలేదని వారు ఆరోపించారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అశోక్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగులతో కలిసి చాయ్ తాగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ నిరసనకు ప్రతీకగా ఒక ఖాళీ కుర్చీని ఏర్పాటు చేసి, విద్యార్థి నాయకులు చాయ్ తాగుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు లక్మల్లా శివ, రాజేష్ నాయక్, నరేష్, జునైద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

30వ కార్తీక మాస వనభోజనాల్లో పాల్గొన్న హమీద్ పటేల్.....



క్రైమ్ మిర్రర్ మియాపూర్ మియాపూర్ : నరేన్ గార్డెన్‌లో నిర్వహించిన 30వ కార్తీక మాస వనభోజన కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ పాల్గొన్నారు.కుటుంబ సభ్యులు, మిత్రులు, ఆత్మీయులతో కలిసి భక్తి, సంప్రదాయం, ఆత్మీయతల మధ్య ఆనందంగా గడిపారు. ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతి విలువలను మరింత బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు.



ఎంబీబీఎస్ విద్యార్థిని సౌమ్యకు గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.25 వేల ఆర్థిక సాయం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన వాటం శ్రీశైలం కుమార్తె సౌమ్య ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమె చదువుకు అండగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థిని కుటుంబ సభ్యులకు స్టడీ మెటీరియల్ ఖర్చుల నిమిత్తం ఈ మొత్తాన్ని అందజేశారు. రాబోయే మూడేళ్ల పాటు కూడా స్టడీ మెటీరియల్ ఖర్చులను భరిస్తామని గోలి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు విజయ్ గౌడ్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేష్ గౌడ్, రుక్సుద్దీన్, వీరాస్వామి, భానుచందర్, మాణిక్యం, పరమేష్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో కేసు ఉండగా చౌరస్తాల్లో నిరసనలు..?

అంబేద్కర్ విగ్రహం సాక్షిగా అసత్య ప్రచారం చేయడం దారుణం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి మండలం కుర్మిద గ్రామంలోని సర్వే నంబర్లు 140, 136/అ/అఇ1 భూములకు సంబంధించి పలు పత్రికలు, టీవీ ఛానళ్లలో వస్తున్న కథనాలు ఏకపక్షంగా, వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని భూ వివాదానికి సంబంధించిన మరో వర్గం దాయాదులు తీవ్రంగా ఖండించారు. ఐదుగురు అన్నదమ్ముల కుమారుల మధ్య కొనసాగుతున్న కుటుంబ వారసత్వ భూ వివాదానికి రాజకీయ రంగు పులిమి, అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. తాము కూడా రైతులమని, తమ పత్తి చేనును నాశనం చేసి వరి కోత యంత్రంతో వెళ్లేందుకు ప్రయత్నించారని, శీను మీడియా ప్రతినిధులను తీసుకువచ్చి తమ పరువుకు భంగం కలిగించారని ఆరోపించారు. తమ వాదనను కూడా మీడియా పరిగణనలోకి తీసుకోవాలని కోరినా, ఒకవైపు సమాచారానికే ప్రాధాన్యం ఇచ్చి వెళ్లడం అన్యాయమని అన్నారు. శీను, మల్లేష్, వారి బామ్మర్ది కలిసి పత్రికలను ప్రభావితం చేస్తూ వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారని ఆరోపించారు. కోర్టులో కేసు విచారణలో ఉండగా, అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని తమదే భూమి అంటూ నిరసనలు తెలపడం సానుభూతి పొందేందుకు చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు. కోర్టు తీర్పు వచ్చే వరకు భూమిపై హక్కుల విషయంలో తొందరపడి ప్రకటనలు చేయడం సరికాదన్నారు. సివిల్ వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నారని తెలిపారు. గ్రామంలో వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న మాజీ సర్పంచ్ పై ఆరోపణలు చేయడం తగదన్నారు. అధికారులను బ్లాక్‌మెయిల్ చేసే విధంగా ప్రకటనలు చేస్తూ, మరోవైపు తమపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండించారు.



జీహెచ్ఎస్ వరల్డ్ స్కూల్ హ్యాకథాన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏవి ప్రమోద్

హయత్‌నగర్‌లో నిర్వహించే జీ హెచ్ఎస్ హాక్స్ కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా ఆహ్వానం

ఎల్బీనగర్,నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్) హయత్ నగర్ లోని జీహెచ్ఎస్ వరల్డ్ స్కూ ల్ లో నిర్వహిస్తున్న వార్షిక నైపు ణ్యోత్సవంలో భాగంగా నైపుణ్యాల ప్రదర్శనలో కార్యాచరణ(క్రియ-స్కిల్స్- ఇన్ని-యాక్షన్)నిర్వహిస్థు న్న హ్యాకథాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నోబుల్ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మా టిక్స్ విభాగపతి, ఉస్మా నియా విశ్వవిద్యాలయం అనుబం ధ కళాశాల అధ్యాపకులు,తెలంగా ణ ప్రైవేటు ఉద్యోగుల ఫోరంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి ప్రమోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు.శనివారం నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో "స్ఫూర్తినిరగిలించు -- నైపుణ్యాన్ని పెంపొందించు -- భవిష్యత్తును తీర్చిదిద్దు"అనే ప్రధాన ఇతివృత్తంతో కొనసాగు తోంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో కృత్రిమ మేధస్సు (ూ×) వినియోగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై ఉన్న అనుభవం విద్యర్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టు లను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.సాంకేతిక రంగంలో వస్తున్న నూతన మార్పులు,ఆవి ష్కరణలు,భవిష్యత్తు అకాశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. విద్యార్థులను కేవలం



పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయ కుండావారి లో సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొం దించడమే ఈ నైపుణ్యోత్సవం ముఖ్యఉద్దేశమని ఆయన పేర్కొ న్నారు.యువతలో దాగి ఉన్న ప్రతి భను వెలికితీస్తూ నూతన ఆవిష్క రణలకు ప్రోత్సాహం అందించే ఈ కార్యక్రమంలో నేను కూడా భాగ స్వామ్యం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో అకాడమిక్ డైరెక్టర్, సీఈఓ గిరిజ సింగిరెడ్డి, బోర్డ్ ఆఫ్ మేనే జ్మెంట్ డా.అనంతరెడ్డి, డా.సామ సుదర్శన్ రెడ్డి,డా.నాగేంద్రబాబు, మరియు జీస్కూల్ అధ్యాపక బృందం విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఉచిత శిక్షణ

90 రోజుల పాటు ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ.. రెండో బ్యాచ్ విజయవంతంగా పూర్తి

అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను చేరువ చేయడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమం రెండో బ్యాచ్ విజయవంతంగా పూర్తయింది. 90 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించిన ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులను అభినందించి, వారికి ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది యువతలో ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన శిక్షణ పొందలేకపోతున్నారని అన్నారు. అలాంటి యువతకు అండగా నిలవాలనే సంకల్పంతో ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఉచితంగా పోలీస్ ఉద్యోగాల శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం ఒక వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చగల గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, ఆత్మవిశ్వాసంతో నిరంతరం సాధన చేసి తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

90 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ..

మొదటి బ్యాచ్ విజయవంతం కావడంతో రెండో బ్యాచ్‌కు కూడా అదే స్ఫూర్తితో 90 రోజుల పాటు నాణ్యమైన శిక్షణ అందించారు. రాష్ట్రస్థాయి అధ్యాపక బృందంతో ప్రతిరోజూ తొమ్మిది గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు రోజువారీ పరీక్షలు, వారాంతపు గ్రాండ్ టెస్టులు నిర్వహించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను అభ్యర్థుల్లో పెంపొందించేలా శిక్షణ ఇచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులు రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

స్కిల్ ఫ్యాక్టరీ ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు..



యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా భవిష్యత్తులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలోని స్కిల్ ఫ్యాక్టరీ ద్వారా ఏఐ, ఐటీ, భాషా నైపుణ్యాలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని సుంకిరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో శిక్షణ, ఉపాధి కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఒక యువకుడికి ఉద్యోగం లభిస్తే ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందన్న లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ముందుకు సాగుతోందన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు మాట్లాడుతూ.. 90 రోజుల పాటు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయి అధ్యాపకుల బోధన, ప్రతిరోజూ తొమ్మిది గంటల తరగతులు, రోజువారీ పరీక్షలు, వారాంతపు గ్రాండ్ టెస్టులు తమకు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించడం తమలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్, శ్రీపతి, శ్రీనితో పాటు పలువురు పాల్గొన్నారు.

సంజీవ్ ముదిరాజ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు బొక్కల శ్రీనివాస్ డిమాండ్



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ): కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో సేవలందిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్‌కు బీసీ కోటాలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవి కల్పించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు బొక్కల శ్రీనివాస్ ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్టీ కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా, పార్టీ మారకుండా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన నిబద్ధత గల నాయకుడు సంజీవ్ ముదిరాజ్ అని కొనియాడారు. బీసీల హక్కుల కోసం కూడా నిరంతరం పనిచేస్తున్న ఆయన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని సంజీవ్ ముదిరాజ్‌కు ఎమ్మెల్సీ పదవి కల్పించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముదిరాజ్ సామాజిక వర్గానికి గణనీయమైన జనాభా ఉందని, ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. పార్టీకి విధేయులుగా పనిచేసే నాయకులకు గుర్తింపు ఇవ్వడం ద్వారా కార్యకర్తల్లో మరింత నమ్మకం పెరుగుతుందని బొక్కల శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు



క్రైమ్ మిర్రర్,మంగపేట: మండలంలోని రాజుపేట గ్రామంలో ఆదివారం భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానికులు జయంతి వేడుకలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీల ఆశాజ్యోతి అయిన బిర్సా ముండా సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామ కృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ నాయకులు బిర్సా ముండా చిత్రపటం వద్ద పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఆయన కీర్తిని కొనియాడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

ఈ సందర్భంగా ముఖ్య అతిథి బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఆదివాసీల హక్కులు, భూమి, స్వేచ్ఛ కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. ఆనాడు బ్రిటిష్ పాలకులకు, స్థానిక జమీందార్లకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి, తన 24వ ఏటనే ప్రాణాలర్పించి అమరుడయ్యారని తెలిపారు. ఆయన చేసిన త్యాగాలు రాబోయే భావితరాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మరియు గిరిజన హక్కుల పోరాటంలో బిర్సా ముండా పాత్ర అత్యంత కీలకమైనదని జల్, జంగల్, జమీన్ నినాదంతో గిరిజనులను ఏకం చేసి హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పోలేబోయిన సుధాకర్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణ్ దొర, ఆదివాసీ జేఏసీ నాయకుడు పోలేబోయిన ఆదినారాయణ, ఉద్యోగ సంఘం నాయకుడు మద్దెల అంజయ్య పాల్గొన్నారు. అలాగే ఆదివాసీ పెద్దలు పోలబోయిన రామరాజు, సోయం అచ్చయ్య, పండా శ్రీను, ఎట్టి సారయ్య, మేకల రాందాసు, గొప్ప చంద్రకాంత్, గట్టిపల్లి అర్జున్, కొమరం రవి, పోలెబోయిన నాగార్జున, చందా పూర్ణ, కొమరం పుల్లారావు పాల్గొన్నారు.

బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా మారబోయిన రవి యాదవ్.



క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి : ఎమ్ ఎస్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బ్లాక్ బెల్టులు, ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆహ్వానించిన శ్రీధర్ గారికి, అకాడమీ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.



ఈ నెల 29న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన జిల్లా కార్యవర్గ కమిటీ ఎంపిక ఈ నెల 29న కల్వకుర్తి పట్టణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మడమోని విజయేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ కమిటీ పదవీకాలం ఈ నెలతో ముగియనున్న నేపథ్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 29న ఉదయం 9 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రస్తుత కార్యవర్గ కమిటీ సభ్యులతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని కోరారు. సమావేశానికి వచ్చే కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ అక్రిడిటేషన్ ఫారంతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేసే సమర్థవంతమైన నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరారు.

సైబరాబాద్ లో డ్రంక్ అండ్ డ్రైవ్..

282 మందిపై కేసులు...

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 282 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో 233 మంది ద్విచక్ర వాహనదారులు, 11 మంది ఆటో డ్రైవర్లు, 36 మంది కార్ల డ్రైవర్లు, ఇద్దరు హెవీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ ఏడీసీపీ అడ్మిన్ జి. నరేందర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక నవంబర్ 9 నుంచి 14 వరకు నమోదైన 185 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించగా, 15 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, 9 మందికి సోషల్ సర్వీస్‌తో పాటు జరిమానా, 161 మందికి జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు.





పోచమ్మ ఆలయ శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

-మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని దేవి చెరువు సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి ఆలయంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని జిల్లెల్ల గ్రామ మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ పి. పాండు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన పోచమ్మ ఆలయంలో జిల్లెల్ల, యంగంపల్లి గ్రామాలకు చెందిన దాతలతో పాటు పలువురి పేర్లతో నాలుగు శిలాఫలకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా రెండు శిలాఫలకాలను తొలగించి బయట పడేసి ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆలయంలో విధ్వంసానికి పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని వారు డిమాండ్ చేశారు.

ప్రకృతి ఆరాధనకు, త్యాగానికి ప్రతీక ఛఠ్ పూజ...

క్రైమ్ మిర్రర్ రాయదుర్గం: రాయదుర్గం మల్కం చెరువు వద్ద జరిగిన ఛఠ్ పూజ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూర్య భగవానుడిని, ఛఠీ మాతను ఆరాధించే ఈ పండుగ మన సంస్కృతికి, ప్రకృతి ఆరాధనకు గొప్ప ప్రతీక అన్నారు. కఠిన ఉపవాస దీక్షలు చేసే తల్లుల, సోదరీమణుల త్యాగానికి ప్రతి ఒక్కరం తలవంచాలన్నారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, శివ సింగ్, అమర యాదవ్, అశోక్, రాజేశ్వర్, శ్యామ్ యాదవ్, రవి ముదిరాజ్, రాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎలికేశ్వరం-1 ఇసుక రీచ్‌లో అక్రమ వసూళ్ల దందా..!!

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా..? ఇసుక రీచ్‌ల నిర్వహణలో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారా..? ప్రభుత్వ అనుమతుల మాటున అదనపు వసూళ్లకు తెరలేపుతున్నారా..? ఒక్కో లారీపై వేలాది రూపాయల అదనపు భారం మోపుతున్నారనే ఆరోపణలు ఇప్పుడు ఇసుక రవాణా రంగంలో చర్చనీయాంశంగా మారాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధిలోని ఎలికేశ్వరం-1 ఇసుక రీచ్‌లో జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న అదనపు వసూళ్ల వ్యవహారం తీవ్ర చర్చకు దారితీస్తోంది.

ఒక్కో లారీపై రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు భారం

ఎలికేశ్వరం-1 ఇసుక రీచ్‌కు వచ్చే లారీల నుంచి నిబంధనలకు మించి అదనంగా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లోడింగ్ చార్జీల పేరుతో ఈ అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇసుక రవాణా ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లారీ యజమానులు, నిర్వాహకులకు ఈ అదనపు భారం మరింత భారంగా మారుతోందని తెలుస్తోంది. అసలు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు ఎంత? వాస్తవంగా వసూలు చేస్తున్న మొత్తం ఎంత? అదనంగా వసూలు చేస్తున్న డబ్బులకు అధికారిక రసీదులు ఇస్తున్నారా? ఆ మొత్తాలు ప్రభుత్వ ఖాతాల్లో జమ అవుతున్నాయా? లేక ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పీఓ పర్యవేక్షణ ఎక్కడ..?

ఇసుక రీచ్ నిర్వహణలో సంబంధిత ప్రాజెక్టు అధికారి (పీఓ) పర్యవేక్షణ కీలకం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్యకలాపాలు సాగుతున్నాయా లేదా అన్నది పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఎలికేశ్వరం-1 రీచ్‌లో అదనపు వసూళ్ల ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ కనిపించడం లేదనే విమర్శలు



వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో పీఓకు సమాచారం లేదా? తెలిసి కూడా పట్టించుకోవడం లేదా? లేక క్వారీ యాజమాన్యానికి తెరవెనుక సహకారం ఉందనే అనుమానాలకు తావిస్తున్న పరిస్థితులు ఉన్నాయా? అన్నది తేలాల్సి ఉంది. అయితే పీఓ ప్రమేయంపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలి.. విచారణ జరపాలి

ఎలికేశ్వరం-1 ఇసుక రీచ్‌లో జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న అదనపు వసూళ్లపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలి. అధికారిక చార్జీల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి. అదనపు వసూళ్లు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ వనరుల నిర్వహణలో అక్రమాలకు చోటు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా పాలనా యంత్రాంగానిదే. అసలు ఎలికేశ్వరం-1 ఇసుక రీచ్‌లో అదనపు వసూళ్లకు తెరపడేదెప్పుడు..? పీఓ పర్యవేక్షణపై ఉన్న అనుమానాలు తొలగేదెప్పుడు..? ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా..

హత్నూర్ డీజేఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

హత్నూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 15: దళిత జర్నలిస్టుల హక్కుల సాధన, ఐక్యత, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేయాలనే లక్ష్యంతో దళిత జర్నలిస్టుల ఫోరం (డీజేఎఫ్) హత్నూర మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల స్థాయిలో దళిత జర్నలిస్టులను ఐక్యంగా సమీకరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు సంఘటితంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. డీజేఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ముక్కగళ్ల యాదన్న, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వరిగుంతం శంకర్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా మీనంపల్లి కిషన్ రావు, అధ్యక్షుడిగా మద్దెల పోచయ్య, ఉపాధ్యక్షుడిగా నాయికోటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా పరమేషుల కిష్టయ్య, సహాయ కార్యదర్శిగా కొండేగల్ల శ్రీధర్, కోశాధికారిగా బక్కోల్ల ప్రతాప్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా బ్యాగరి శ్రీహరి, వరిగుంతం, ఆవుల మల్లేష్, నీరుడి మనోహర్, తూర్పాటి రమేశ్, బ్యాగరి పద్మారావు, నాయికోటి పవన్‌లను, నీరుడి మనోహర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘం బలోపేతానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఈ సందర్భంగా డీజేఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న మాట్లాడుతూ.. ఈ నెల 18న సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న దళిత జర్నలిస్టుల ఫోరం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి ఉమ్మడి



మెదక్ జిల్లా జర్నలిస్టులందరూ పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు రాష్ట్ర మహాసభలు కీలక వేదికగా నిలవనున్నాయని తెలిపారు. దళిత జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు వారికి తగిన భద్రత, గౌరవం, సామాజిక న్యాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలతో పాటు దళిత జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలను రాష్ట్ర మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకు అనుగుణంగా తీర్మానాలు చేయనున్నట్లు వివరించారు. దళిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివక్ష, ఆర్థిక ఇబ్బందులు, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం అవసరమని పేర్కొన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యతతో ముందుకు సాగినప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని అన్నారు. డీజేఎఫ్ రాష్ట్ర మహాసభలకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి జర్నలిస్టులు,

పర్వేద గ్రామంలో అక్రమ బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు 8 కేసులు నమోదు, 42 లీటర్ల మద్యం స్వాధీనం

8 బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

8 కేసులు నమోదు

141 మద్యం సీసాలు స్వాధీనం

సుమారు 42 లీటర్ల మద్యం పట్టివేత



క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వేద గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై ఫ్యూచర్ సిటీ పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ జి. రుద్వీర్ కుమార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఏకకాలంలో 8 అక్రమ బెల్ట్ షాపులపై దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 8 కేసులు నమోదు చేసి, వివిధ బ్రాండ్లకు చెందిన 141 మద్యం సీసాలు (సుమారు 42 లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. కిరాణా దుకాణాలు, జనరల్ స్టోర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. అక్రమ బెల్ట్ షాపుల వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో నష్టపోతున్నాయని, మద్యానికి బానిసై కొందరు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఫ్యూచర్ సిటీ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం అందజేత



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): కడ్తాల్ మండలం సాలార్పూర్ తండాలో నిర్మాణంలో ఉన్న శ్రీ శివరామాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ.3 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని గతంలో ఇచ్చిన హామీలో భాగంగా తొలి విడతగా ఈ మొత్తాన్ని అందించారు. మిగిలిన రూ.2 లక్షలను కూడా త్వరలో అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, గ్రామాల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం వాసుదేవ్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ తండాలో శ్రీ తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు ప్రియా రమేష్, కేతావత్ రమేష్ నాయక్, అమర్ సింగ్, ఉపసర్పంచులు మహేశ్వరి కుమార్, ఎర్ర రామకృష్ణ, రమేష్, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు మోహన్, పకీర, జగన్, పాండు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మధురమైన జ్ఞాపకాలు మరువలేని స్నేహబంధాలు





రామప్పలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 15: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన, యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప ఆలయ ప్రాంగణంలో మండలంలోని నల్లగుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న.పదవ తరగతి 1990--1991 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పవిత్రమైన కార్తీక మాసంలో.ప్రముఖ శైవ క్షేత్రమైన రామప్ప దేవాలయం వేదిక కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. శ్రీ రామలింగేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు గావించి తదుపరి వారి మధుర స్మృతులను రామప్ప గార్డెన్ లో నెమరు వేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. చదువుకున్న పాఠశాల రోజులు వేరు... నేటి జీవిత ప్రయాణాలు వేరు... కానీ మన మధ్య ఉన్న స్నేహబంధం మాత్రం ఎప్పటికీ ఒక్కటే! 36 సంవత్సరాల కాలం గడిచినా, మనసులోని బాల్య జ్ఞాపకాలు చెరిగిపోలేదు. ఆనాటి నవ్వులు, ఆటలు, అల్లరి, స్నేహాలు మళ్లీ ఒక్కచోట కలుసుకున్నాయి. వయసు పెరిగినా స్నేహానికి వయసు లేదు. దూరాలు పెరిగినా మనసుల మధ్య దూరం లేదు. ఈ అపూర్వ కలయిక మన జీవితాల్లో మధురమైన జ్ఞాపకంగా, మరపురాని అనుభూతిగా నిలిచిపోవాలని కోరుకుంటూ...మన స్నేహం చిరకాలం వర్ధిల్లాలి! అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు అభినందనలు తెలుపుతున్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులు, ప్రైవేటు ఉద్యోగులు రైతులు అన్ని రంగాల వారు బ్యాచ్ లో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఇరిగేషన్ డి ఈ ఈ భుక్యా రాజు, ప్రధానోపాధ్యాయులు కొమురవెల్లి ఏకాంబరం, వేణు, వీరగొని రాజయ్య, రాజకీయ ప్రముఖులు నల్లగుంట మాజీ సర్పంచ్ మందల శ్రీధర్ రెడ్డి, లక్ష్మీదేవి పేట ఉపసర్పంచ్ కొండ తిరుపతి, జర్నలిస్టులు పిల్లలమర్రి శివ, రాము పూర్వ విద్యార్థులు చిన్నబోయిన కుమార్, శ్యామ్, సరిత, రమ, పద్మ, మంజుల, పుష్పమాల, రమణమ్మ, సుమారు 45 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



జోగిపేట ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 15: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేట-- ఆందోల్ ట్యాంక్ బండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌తో పాటు బతుకమ్మ కుంట, డోబీఘాట్, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాలను సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను, ప్రతిపాదిత టూరిజం హోటల్ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నర్సింగ్ కళాశాల భవనాన్ని కూడా మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, ట్యాంక్ బండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. నర్సింగ్ కళాశాల ప్రారంభానికి సంబంధించి మిగిలి ఉన్న పనులను శరవేగంగా పూర్తి చేసి త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

బాలల భవిష్యత్తుకు ప్రత్యేక గ్రామసభ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి): తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో బాలల దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణ, సంస్కారం, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. పిల్లల ప్రతిభను వెలికితీసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. గ్రామంలో పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రమాదేవి, ఉపసర్పంచ్ రాఘవేందర్ గౌడ్, వార్డు సభ్యులు ఎండీ వాజిద్, విజయ్ కుమార్, నరసింహ, గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

